


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :147 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ ఆదివారం 27-09-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## జనగామలో ఘనంగా పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు !

జనగామ : జనగామ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణం, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని బ్రప్రారంభించారు.

ఈ సందర్భంగా జనగామ మున్సిపాలిటీకి రూ. 1.77 కోట్ల విలువైన 16 చెత్త సేకరణ ఆటోలు, జేసీబీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అలాగే మున్సిపాలిటీలో శానిటరీ వర్కర్లు 30 మంది, డ్రైవర్లు 20 మంది, ఎలక్ట్రిషియన్లు నలుగురు.. మొత్తం 54 మందికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మున్సిపల్ డంపింగ్ యార్డు షెడ్, మెషినరీ పనులకు రూ. 2 కోట్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్టీపీ)కు రూ. 38 కోట్లు సహా పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. తరిగొప్పుల మండలంలో రూ. 2.25 కోట్లతో తహసీల్దార్ కార్యాలయం నూతన భవనం, బచ్చన్నపేట మండలం కట్కూర్ జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో రూ. 38.75 లక్షలతో మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా పోచన్నపేట, రామచంద్రపురం ఎంపీపీఎస్ పాఠశాలలు, జనగామ కోర్టు సమీపంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు)లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లాలోని ల12 కేజీబీవీలు, 15 పీఎం శ్రీ పాఠశాలలు, 28 జెడ్పీహెచ్ఎస్ (బాలికలు)లో అవుట్ డోర్ బాస్కెట్ బాల్ కోర్టుల నిర్మాణ పనులకు కూడా శ్రీకారం చుట్టారు. జనగామ ప్రభుత్వ జనరల్



ఆసుపత్రి ఆవరణలో అంతర్గత సీసీ రోడ్డు, చంపక్ హిల్స్లోని మాతా–శిశు ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్కు సీసీ రోడ్డు, పార్కింగ్ ప్రాంత అభివృద్ధి, యూజీడీ పైప్లాన్ పనులు చేపట్టనున్నారు. అలాగే జనగామ ఐడీఓసీ వద్ద పార్కింగ్ టైల్స్, ఫెన్సింగ్, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాలను మంత్రి ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్, మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి, వైస్ చైర్మన్ భూష పర్వతాలు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్‌లో స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభం...




మెదక్, సెప్టెంబర్ 26: నిరుపేద విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకుండా, వారికి పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించి చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేలా చేయడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటీ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా రీజినల్ ప్రెసిడెంట్ సత్య గౌరవ చంద్రదాస్ తెలిపారు. శనివారం మెదక్ మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను తొలుత కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిందని తెలిపారు. అక్కడ వచ్చిన స్పందన ఆధారంగా మధిర, మంథని, మంచిర్యాల, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు వివరించారు.

### 29,183 మంది విద్యార్థులకు అల్పాహారం

కార్యక్రమాన్ని మరింత విస్తరించడంలో భాగంగా మెదక్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. దీని ద్వారా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల పరిధిలోని సుమారు 11 మండలాల్లో 395 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 29,183 మంది విద్యార్థులకు ప్రతిరోజూ పరిశుభ్రమైన, రుచికరమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించనున్నట్లు చెప్పారు.

### NIN సహకారంతో ప్రత్యేక మెనూ

విద్యార్థులకు సమతుల్యమైన పోషకాహారం అందించేందుకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సహకారంతో అల్పాహార మెనూను రూపొందించినట్లు సత్య గౌరవ చంద్రదాస్ తెలిపారు. ఇడ్లీ–సాంబార్, పూరీ–ఆలూ కుర్మా, దోశ–చట్నీ, ఉప్మా–చట్నీ, మిల్లెట్ ఇడ్లీ–సాంబార్, బోండా–చట్నీ వంటి వివిధ రకాల అల్పాహారాన్ని అందించనున్నట్లు చెప్పారు. అలాగే రోజు విడిచి రోజు విద్యార్థులకు వేడి పాలను అందించనున్నట్లు వెల్లడించారు.

### హాజరు శాతం పెరిగింది

కొడంగల్‌లో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని, సుమారు 5 వేల మంది విద్యార్థులు తిరిగి పాఠశాలలకు రావడం సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ అనుభవంతో కార్యక్రమాన్ని తెలంగాణలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉదయం వేళ పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడేలా కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు సత్య గౌరవ చంద్రదాస్ తెలిపారు. విద్యార్థులు ఆకలితో కాకుండా ఆరోగ్యకరమైన అల్పాహారంతో ఉత్సాహంగా పాఠశాలకు హాజరై చదువుపై దృష్టి సారించడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

### ఎన్నికల హామీని నిలబెట్టుకున్నాం: మంత్రి వివేక్ వెంకటస్వామి

మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ ఇస్తామని ఎన్నికల్లో చెప్పామని, హరికృష్ణ ఫౌండేషన్ సహకారంతో దీనిని ప్రారంభించామని తెలిపారు. రూ. 6 కోట్లతో పిల్లలకు నాణ్యమైన రుచికరమైన టిఫిన్ ఇస్తున్నామని పేర్కొన్నారు. కొందరు ఎన్నికల ముందు చెప్పారు, వదిలేశారని.. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని దీనిని ప్రారంభిస్తున్నారని చెప్పారు. 15 రోజుల్లో విద్యార్థులందరికీ టిఫిన్ అందజేస్తామని, మెనూ ప్రకారం అందిస్తున్నామని వెల్లడించారు.

### విద్య, క్రీడలు, టెక్నాలజీలో రాణించాలి

ఎక్కడా నాణ్యత తగ్గకుండా ప్రభుత్వం చేస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉద్యోగాలు పొందాలని, మంచి ఫుడ్ తింటే స్పోర్ట్స్ లోనూ రాణించగలుగుతారని ఆకాంక్షించారు. ప్రతి నియోజకవర్గంలో కొత్త టెక్నాలజీతో దేశంలోనే ఐటీసీలు ప్రారంభించామని, టెక్నాలజీ రంగంలోనూ ఉద్యోగ అవకాశాల్లో తెలంగాణ ముందుండాలని ఆకాంక్షించారు

## ఖైరతాబాద్ ఉపఎన్నికపై కవిత సంచలనం.. పోటీపై సెన్సేషనల్ ప్రకటన




హైదరాబాద్, తెలంగాణ రాజకీయం అంతా ఖైరతాబాద్ ఉప ఎన్నిక చుట్టూ తిరుగుతున్న వేళ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఇవాళ బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేటీఆర్ ఫామ్ హౌస్ డ్రామా అని ఇదంతా లోపాయికారీ ఒప్పందాలే తప్ప ఫామ్ హౌస్?లపై ఎలాంటి చర్యలు ఉండబోవని విమర్శించారు. ఇది కేవలం మాటల ప్రభుత్వమేనని.. చేతలు శూన్యం అని దుయ్యబట్టారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరణమృదంగం:

ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలు అత్యంత ఆందోళనకర రీతిలో పెరిగిపోయాయని కవిత ఆరోపించారు. ఆర్టీఐ ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా 200-21 సంవత్సరంలో 6239 మంది చిన్నారులు ప్రభుత్వ ఆసుపత్రిలో మరణిస్తే 2021-22 లో 4993 మంది, 2024-25 లో 3853 మంది పిల్లలు మరణించారని వెల్లడించారు. ఏ జిల్లాలో చూసినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయని విమర్శించారు. విశ్వనగరంగా మారుస్తామని ప్రభుత్వాలు చెబుతున్న హైదరాబాద్? లోని ప్రభుత్వ ఆసుపత్రిలో గతేడాది 1046 మంది చిన్నారులు మరణించారన్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వాసుపత్రులను మెరుగుపరుస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హెల్త్ సెక్టార్ కు కేటాయించిన బడ్జెట్ కేవలం 5 శాతం మాత్రమేనని అన్నారు.

### ఒక్కొక్కడి తోలు తీస్తాం:

ఆదిలాబాద్ రిమ్స్ లో ప్రమాదం జరిగాక మంత్రులు, ప్రజాప్రతినిధులు వస్తున్నప్పటికీ ఇప్పటికీ అక్కడ పరిశుభ్రత పాటించడం లేదని కవిత మండిపడ్డారు. ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత లేకపోతే ఫోటోలు, వీడియోలు తీసి టీఆర్ఎస్ సోషల్ మీడియాకు ట్యాగ్ చేయాలని యువతకు కవిత పిలుపునిచ్చారు. ఒక్కొక్కరి తోలు తీస్తామని హెచ్చరించారు. ఎంత సేపటికి రాజకీయాలేనా విద్యా, వైద్యంపై పట్టింపు లేదా అని నిలదీశారు. ఏడాదికి 4 వేల మంది చిన్నారులు చనిపోతుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. టీఆర్ఎస్ కార్యకర్తలు స్కూల్స్ బాట పట్టాలని ఎక్కడైతే బాత్ రూమ్ లు లేవో వాటిని ఫోటో తీసి ట్యాగ్ చేయాలన్నారు. అవసరం అయితే టీఆర్ఎస్ పార్టీ నిధులు జమ చేసి టాయిలెట్స్ నిర్మిస్తామన్నారు.

## రేషన్ ఈకేవైసీకి అక్టోబరు నెలాఖరు వరకు గడువు..



హైదరాబాద్,రేషన్ లబ్ధిదారులు ఈ–కేవైసీ చేసుకునేందుకు ప్రభుత్వం అక్టోబరు నెలాఖరు వరకు గడువు పొడగించింది. జిల్లాలో 20 శాతం మంది ఈకైవేసీ చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం మూడు నెలల బియ్యం కోటా పంపిణీ పూర్తి అయింది. రేషన్ దుకాణాలను మూసివేశారు. ఈ నేపథ్యంలో ఇంటి నుంచే మొబైల్ ద్వారా ఈ కేవైసీ పూర్తి చేసుకునేలా ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. పూర్తయిందో లేదో తెలుసుకు నేందుకు వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. లబ్ధిదారులకు కొంచెం అవగాహణ ఉంటే ఈ ప్రక్రియ సులువుగా పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

### ఓటీపీ ద్వారా..

ముందుగా మొబైల్‌లో పేస్టోర్ నుంచి మేరా ఈకేవైసీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆధార్‌పేస్ ఆర్డి యాప్‌ను ఓపెన్‌చేసి రాష్ట్రాన్ని ఎంపిక చేసుకొని ఆధార్ నంబర్,క్యాప్చను ఎంటర్ చేయాలి. వచ్చే ఓటీపీ ద్వారా వెరిఫైచేసుకొని ఆధార్‌యాప్‌లో లబ్ధిదారుల ఫోటో వెరిఫికేషన్ పూర్తిచేస్తే ఈ–కైవేసి ప్రక్రియ పూర్తియినట్లు సందేశం వస్తోంది. పౌరసరఫరాల శాఖ వారి లింక్ ను ఉపయోగించి రేషన్ కార్డు నెంబరు,క్యాప్చను నమోదు చేస్తే కు టుంబీకుల వివరాలు కన్పిస్తాయి. పేర్ల పక్కన యా క్టివ్ అని కన్పిస్తే ఈ కేవైసీ అయినట్టు,ఒక వేళ ఇన్ యాక్టి వ్‌గా ఉంటే ఈ– కేవైసీ కానట్టు భావించాల్సి ఉంటుంది. జిల్లాలో ఇంకా 20శాతం ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంది. గత మూడు నెలల నుంచి ఎన్‌ఫోర్సుమెంటు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవ గాహణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. అర్హులకు రేషన్ బియ్యం అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రక్రి యను చేపడు తున్నారు. ప్రతి ఒక్కరు కూడా ఈ కేవైసీ చేసుకోవాలని సూచిస్తున్నారు. రేషన్ చౌక దుకాణాల వద్దకు పోకుండా ఇంటి వద్దనే ఆన్‌లైన్ ద్వారా వెలుసుబాటు చేసుకు నేందుకు మొబైల్ యాప్ ద్వారా అవకాశం ఇవ్వడంతో అంతా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ప్రశాంతంగా గణేశ నిమజ్జనాలు పూర్తి.. పోలీసులకు సీపీ సజ్జనార్ అభినందనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 : భాగ్యనగరంలోని నాలుగు కమిషనరేట్‌లలో విజయవంతంగా గణేశ్ శోభాయాత్రలు ముగిశాయని హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ వ్యాఖ్యానించారు. ఈ వేడుకకు సహకరించిన అన్నిశాఖల అధికారులను అభినందించారు. హోం గార్డ్ నుంచి ఐపీఎస్ అధికారుల వరకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎక్కువగా శోభాయాత్రలు జరిగాయని వెల్లడించారు.

### ఖైరతాబాద్,బాలాపూర్ గణపతుల సమయానికి నిమజ్జనం చేశాం..

భాగ్యనగరంలోని గణేశ్ నిమజ్జనోత్సవాల బందోబస్తు కోసం తెలంగాణలోని బయట జిల్లాల నుంచి సిబ్బందిని రప్పించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనాలను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఖైరతాబాద్, బాలాపూర్ వినాయకుల విగ్రహాలను సమయానికి నిమజ్జనం చేశామని వెల్లడించారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈసారి గణనాథుల విగ్రహాలను దర్శించుకోవడానికి భక్తులు ఎక్కువగా వచ్చారని అన్నారు. 30 లక్షలకు పైగా భక్తులు ఖైరతాబాద్ గణేశ్‌ను దర్శించుకున్నారని చెప్పారు. బాలాపూర్ లంబోదరుడిని 15 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని వెల్లడించారు.

### 48 గంటల పాటు పోలీసులు నిద్ర లేకుండా పనిచేశారు..

వినాయకుల శోభాయాత్రాల్లో కొన్ని కొన్ని లోపాలను గుర్తించామని.. వచ్చే



రోజుల్లో వీటిని సరిదిద్దుకుంటామని సీపీ సజ్జనార్ చెప్పారు. రాబోయే రోజుల్లో మెరుగైన సేవలను అందిస్తామని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు నిద్ర లేకుండా బందోబస్తు చేశారని తెలిపారు. శోభాయాత్రలో కలర్ పేపర్‌తో చాలా ఇబ్బంది అవుతోందని.. వచ్చేసారి వీటిని బ్యాన్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నదానం చేసే ప్రాంతాల్లో చెత్తను ఇష్టానుసారంగా వేస్తున్నారని.. అది చాలా ఇబ్బందిగా మారిందని తెలిపారు. శోభాయాత్రలో అల్లరి చేసిన మందుబాబులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలీస్ అధికారులు ఈ వేడుక కోసం 48 గంటల పాటు నిద్ర లేకుండా పనిచేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## అవినీతి సొమ్ముకు ఆశపడి విద్యుత్ రంగం ప్రైవేటు పరం

హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అటకెక్కించింది.. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఘోరంగా విఫలమయ్యారని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణను చీకటి నుంచి వెలుగు కు తీసుకెళ్లారు.. సాధ్యం కాదన్న 24 గంటల విద్యుత్‌ను అన్ని రంగాలకు కొన్ని నెలల్లోనే అందించారు. 36 వేల కోట్లను ట్రాన్స్ కో పై వెచ్చించిన నేత కేసీఆర్ ..ఎక్కడ కరెంటు పోయినా ఒక చోటి నుంచి ఇంకో చోటుకు విద్యుత్ అందించే వ్యవస్థను హైదరాబాద్ లో ఏర్పాటు చేశారు..ఆనాడు కరెంటు పోతేనే వార్త అనే స్థితి ..పవర్ ఉన్నా ఇవ్వలేము అని రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లలో అధికారులు అనే వారు.. కేసీఆర్ సీఎంగా మొదటి రివ్యూ చేసింది విద్యుత్ పైనే.. మొదటి సారి ఐఏఎస్‌కు కాకుండా విద్యుత్ సంస్థల పగ్గాలు తెలంగాణ సోయి ఉన్న ఇతరులకు అప్పగించారు.. ప్రభాకర్ రావు, రఘుమా రెడ్డి శంకర్ నారాయణ్ నియామకాలు ఈ కోవలోనే జరిగాయన్నారు. కేసీఆర్ 2014 జూన్ 2 న అధికారం చేపట్టి నవంబర్ నుంచి వ్యవసాయానికి తప్ప అన్ని రంగాలకు ఉచిత విద్యుత్ ఇచ్చారు ..అధికారులు 24 గంటల ఉచిత విద్యుత్ రైతులకు ఇవ్వలేము అన్నారు.. సరైన డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ లేనందువల్ల ఇవ్వలేము అన్నారు..మూడేళ్ల లోనే డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ మెరుగు పరిచి కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చారు. 28 వేల కిలోమీటర్లు విద్యుత్ లైన్లు వేశాం.. అన్ని రకాల కేవీల సబ్ స్టేషన్ల సంఖ్యను ఎన్నో రెట్లు పెంచాం..ట్రాన్స్ కో లాభాల్లో నడుస్తోంది.. ఈ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తోంది. అవినీతి సొమ్ముకు ఆశపడి ప్రైవేటు పరం చేస్తున్నారు.. ప్రైవేట్‌కు ఎందుకు ఇవ్వాలి ?..పాలిచ్చే ఆవు లాంటి ట్రాన్స్‌కోను దోస్తులకివ్వాలని రేవంత్ కుట్ర చేస్తున్నారని జగదీష్ రెడ్డి ఆరోపించారు.. దేశంలో విద్యుత్ పంపిణీని ఎక్కడ ప్రైవేటు చేసినా ఫలితాలు రాలేదు.. ఒడిశా ,ఢిల్లీ




,ముంబై లో ప్రైవేటు పరం చేస్తే ఫెయిల్ అయ్యారు.. అక్కడ నల్లా బిల్లు కట్టకపోతే కరెంట్ కట్ చేస్తున్నారు .. కరెంటును ప్రైవేటు పరం చేస్తే ప్రజల ఊపిరి ఆగిపోతుంది. తక్కువ ధరకు దోస్తులకు కట్టబెట్టడం ఈ ప్రైవేటు పరం వెనక ఉన్న మతలబు.. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా ఆనాడు విద్యుత్ రంగాన్ని ప్రైవేటుకు ఇవ్వలేదు. పవర్ జెనరేషన్ కాంట్రాక్టులను నాడు భేల్ కు ,జెన్ కోకు ఇచ్చారు.



## సంపాదకీయం

**ఆదివారం 27-09-2026**

# మలుపులు తిరుగుతున్న ఈసీ వ్యవహారం

ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ భారత ఎన్నికల సంఘంలో తీవ్ర కలకలం రేపుతోంది. అర్హులైన ఓటర్ల పేరును జాబితా నుంచి తొలగించడం, అలాగే అధికారిక నిర్ణయాలలో పారదర్శకత లోపించడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత 10 నెలల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు ఈసీ తీసుకున్న పలు నిర్ణయాలపై దాదాపు 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడటంతో ఈ వివాదం మరింత ముదిరింది. సుప్రీంకోర్టు గతంలో పలు కేసుల్లో ఇచ్చిన తీర్పుల్ని ఉల్లంఘిస్తూ తీసుకున్న నిర్ణయాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కు కోర్టు ధిక్కార చర్యల ముప్పు పొంచి ఉంది. దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ సందర్భంగా ఎన్నికల సంఘంలో ఇతర కమిషనర్ల అంగీకారం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్ఞానేష్.. అదే సమయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్నీ బేఖాతరు చేశారు. తోటి కమిషనర్లు అభ్యంతరాలు చెబుతున్నా. పట్టించుకోకుండా కోర్టు తీర్పుల్ని ఉల్లంఘించిన వ్యవహారంలో సీఈసీ జ్ఞానేష్ పై కోర్టు ధిక్కార చర్యలకు రంగం సిద్ధమవుతోంది సీఈసీ జ్ఞానేష్ కుమార్ గతంలో సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో ఇచ్చిన తీర్పుల్ని ఉల్లంఘించడం ద్వారా కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని, ఆయనపై క్రిమినల్ కోర్టు ధిక్కార చర్యల కోసం పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ అటార్నీ జనరల్ వెంకట రమణిని సుప్రీంకోర్టు లాయర్ బ్రజేష్ సింగ్ కోరారు. తాజాగా ఇండియన్ ఎక్స్ ప్రెస్ పరిశోధనాత్మక కథనంలో పేర్కొన్న విధంగా జ్ఞానేష్.. తోటి కమిషనర్ల కంటే ప్రత్యేకంగా భావిస్తూ, ఏకపక్షంగా తీసుకున్న కోర్టు ధిక్కార నిర్ణయాలపై సమీక్ష అవసరమని బ్రజేష్ సింగ్ తెలిపారు. ఓటర్ల తొలగింపును 'అనిధికారికమైనది, చట్టవిరుద్ధమైనది' అని కమిషనర్ సంధు లిఖితపూర్వకంగా పేర్కొనడం ఎన్నికల సంఘం అంతర్గత విభేదాలను బట్టబయలు చేసింది మామూలుగా లేదు! ఓటర్ల జాబితా ప్రక్రియ పరిమాణం ఈ చర్చను మరింత తీవ్రతరం చేసింది. సాఐఖ్ మూడో దశలో 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 6.15 కోట్ల మంది ఓటర్లు ముసాయిదా జాబితాల నుంచి మాయమయ్యారు. వీరిలో 4.52 కోట్ల మంది గైర్హాజరైనట్లు, 1.11 కోట్ల మంది మరణించినట్లు, 49.58 లక్షల మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు వర్గీకరించారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్య 36.08 కోట్ల నుంచి 29.93 కోట్లకు పడిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల జాబితాతో పోలిస్తే ఇది నికరంగా 15.7 శాతం(దాదాపు 5.57 కోట్లు) తగ్గుదలను సూచిస్తోంది. అయితే తొలగించబడిన ప్రతి ఒక్కరూ అనర్హులు కాదని, అభ్యంతరాలు తెలిపి పేర్లను పునరుద్ధరించుకోవడానికి ఈసీ అవకాశం ఇచ్చినప్పటికీ.. పెద్ద ఎత్తున గైర్హాజరుగా వర్గీకరించబడటం అనుమానాలకు తావిస్తోంది. ఈ వివాదం ఇప్పుడు కేవలం ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీల మధ్యనే కాకుండా, ఓటర్ల మధ్య కూడా కొనసాగుతోంది. వన్ఇండియా నిర్వహించిన ఓ అభిప్రాయ సేకరణలో సాఐఖ్ ప్రక్రియపై స్థానికులు తీవ్ర భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఎన్నికల సంఘంపై నమ్మకం కోల్పోయామని కొందరు చెప్పగా.. మరికొందరు ఎన్నికల సంఘంపై తమ విశ్వాసం కొనసాగుతోందని, నకిలీ, వేరే చోటికి మారిన లేదా ఇతరత్రా అనర్హమైన పేర్లను తొలగించడానికి ఈ సవరణ అవసరమని తాము నమ్ముతున్నామని తెలిపారు. ఆటోడ్రైవర్ రాజన్న మాట్లాడుతూ.. పాత జాబితాలో ఉండి ప్రతిసారీ ఓటు హక్కును వినియోగించుకుంటున్న తమ కుటుంబంలోని నలుగురు పేర్లు కొత్త జాబితాలో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ పత్రాలు, ఫోటోలతో ఆఫీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని.. రెక్కాడితే గానీ డొక్కాడని తమలాంటి వారికి ఈ ప్రక్రియ నరకంగా మారిందని వాపోయారు. అలాగే క్యాబ్ డ్రైవర్ నవీర్, మరో వ్యక్తి శంకర్‌లు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలోనే నివసిస్తున్నా తమ ఓటు హక్కు రద్దవ్వడంతో ఎన్నికల వ్యవస్థపైనే నమ్మకం పోయిందని ఆందోళన చెందారు అయితే ఈ సాఐఖ్ ప్రక్రియను సమర్థించే వారు కూడా లేకపోలేదు. నకిలీ ఓట్లను, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించడానికి ఇటువంటి సవరణలు అవసరమేనని బీజాపూర్?కు చెందిన శివానంద్ అభిప్రాయపడ్డారు. ప్రియ అనే యువతి మాట్లాడుతూ.. ఈ సవరణ అవసరమే అయినప్పటికీ సరైన పద్ధతిలో జరగాలని, బతికి ఉన్న తమ అమ్మమ్మ పేరును తొలగించి చనిపోయిన వారి పేర్లను జాబితా లో కొనసాగించడం నిర్వహణ లోపానికి నిదర్శనమని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ.. లక్షలాది మంది ఓటు హక్కు కోల్పోవడం రాబోయే ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని.. నిష్పక్షమైన ఓటింగ్ ప్రక్రియ కోసం ఎన్నికల సంఘం వెంటనే పారదర్శక చర్యలు చేపట్టాలని ఓటర్లు కోరుతున్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ దీప్కే డెడ్ లైన్ పెట్టారు. దేశంలో అత్యున్నత విద్యాసంస్థ అయిన ఐఐటీలో మరో విద్యార్థి నిండు ప్రాణం బలైపోయి, విద్యార్థి లోకం నిరసన వ్యక్తం చేస్తోంది. అయితే ఆ విద్యార్థుల ఉద్యమాన్ని అసలు పట్టించు కోని ఈ జెన్ జీ దీప్కే రాజకీయ వివాదంలోకి మాత్రం పరుగెత్తుకు వచ్చేస్తున్నారు. విద్యాసంస్థల్లో ఒత్తిడి, యువత ఆత్మహత్యలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని మేధావులు, విద్యార్థి సంఘాలు గళమెత్తుతుంటే.. కాక్రోచ్ జనతా పార్టీ మాత్రం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పై ఆరోపణలు చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అది దేశద్రోహి అని.. జ్ఞానేష్ కుమార్ భారత ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారారు అంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వాదనను వినిపిస్తూ మీడియా ముందుకు వచ్చారు. వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియను కాపాడాలంటే ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, రాబోయే 48 గంటల్లోగా తప్పుకోకపోతే దేశవ్యాప్తంగా భారీ ఎత్తున నిరసనలకు దిగుతామని దీప్కే అల్టిమేటం జారీ చేశారు అయితే ఇప్పుడు మళ్లీ.. ఓ కేంద్ర మంత్రిని రాజీనామా చేయించినట్లుగా సీఈసీని రాజీనామా చేయిస్తారా లేదా అన్నది వేచి చూడాలి.

# యుపిఐ చార్జీలు ప్రజలకు భారమే!

న్యూఢిల్లీ,అక్టోబర్ 15 నుండి దేశవాసులపై కేంద్రం మరో పన్నును విధించబోతోంది. యుపిఐ చెల్లింపులపై రూ. 2 వేలు దాటిన ఆర్థిక లావాదేవీలపై 0.4 % మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎం డిఆర్)పేరిట పన్ను వసూలుకు తెర లేవనుంది. ఒక్కో డబ్బు మార్పిడికి కనీసం రూ. 5 నుండి గరిష్టంగా రూ. 300 దాకా ఈ అదనపు భారం వినియోగదారులపై పడనుంది. దీని పై కేంద్రం ఎన్ని చిలుక పలుకులు చెప్పినా ఇది ముమ్మాటికీ జనంపై ఆర్థిక భారం మోపడమే. ప్రజలకు అలవాటైపోయిన విధానాన్ని ఖజానాకు రాబడి మార్గంగా మార్చుకోవడమే దీని ఉద్దేశం. ఇలా వసూలు అయ్యే సొమ్మును బ్యాంకులకు, ఈ యాప్‌లు నడిపే సంస్థలకు పంచుతామని ఎన్‌పిసిఐ అంటోంది. 2021 లో ప్రజలను ఆన్‌లైన్ పేమెంట్ వైపు మళ్లించేందుకు అప్పుడు నామమాత్రంగా ఉన్న ఎండిఆర్‌ను ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపు ద్వారా సర్దుబాటు చేస్తూ వస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రూ. 2000 కోట్లు ఇందుకోసం కేటాయించారు. అయిదేళ్ల కాలంలో ఆన్‌లైన్ చెల్లింపులు లక్షల కోట్లలో పెరిగిపోవడం వల్ల ఈ సొమ్ము సరిపోదు. అందుకే ఈ కొత్త కోతలు మొదలుకానున్నాయి. మనం ఏది కొన్నా, ఎవరికీ డబ్బులు పంపాలన్నా మొబైల్ ఫోన్లలో డౌన్ లోడ్ చేసుకున్న గూగుల్ పే, ఫోన్ పే లాంటి డిజిటల్ వాలెట్ ద్వారా ఆన్ లైన్ పేమెంట్ చేస్తున్నాం. పదేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు, ఆ తర్వాత కోవిడ్ – 19 విజృంభణల కారణంగా జనం స్మార్ ఫోన్లు కొని, చెల్లింపులకు వాటిపై ఆధారపడడం ఎక్కువైంది. దేశంలోని 120 కోట్ల ఫోను వాడకందార్లలో సగానికి పైగా దీనికి అలవాటు పడిపోయారు. పర్సులో డబ్బులు పెట్టుకోవడం, బ్యాంకుల్లో క్యాష్ డ్రా చేయడం తగ్గిపోయింది. ఎటిఎంల వద్ద కూడా రద్దీ తగ్గింది. బ్యాంకులు ఎటిఎంల సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. డబ్బు చలామణి ఎటిఎంల ద్వారా 10% కాగా, ఇంటర్ నెట్ పేమెంట్ 5%, మొబైల్ పేమెంట్ 85% కి పెరిగింది. ఆన్‌లైన్ చెల్లింపులవల్ల కరెన్సీ ముద్రణ కూడా తగ్గిపోయింది. గత అయిదేళ్ల కాలంలో ఆర్‌బిఐ కొత్త నోట్ల ముద్రణకోసం చేసే ఖర్చు గణనీయంగా పడిపోయింది. దీని కోసం ఏటా సుమారు రూ. 6వేల కోట్ల దాకా అయ్యే ఖర్చు రూ. 4.5 కోట్లకు తగ్గింది. కరెన్సీ నోటు జీవితకాలం 4 ఏళ్లు మాత్రమే. పనికిరాని నోట్ల స్థానంలో కొత్త వాటి కోసం ఏటా రూ. వేయి కోట్లు వెచ్చించాల్సి వస్తోంది. ఆర్‌బిఐ ప్రవేశ పెట్టనున్న ప్లాస్టిక్ కరెన్సీతో ఈ ఖర్చు కూడా తగ్గిపోతుంది. ఈ రకంగా నగదు లావాదేవీలు తగ్గి బ్యాంకుల్లో సిబ్బంది అవసరం కూడా తగ్గిపోయింది. బ్యాంకుల్లో నియామకాలు తగ్గి ఏడాదికేడాది సిబ్బంది సంఖ్య కుదించుకుపోతోంది. ఇవన్నీ బ్యాంకు లాభాల వృద్ధిపై ప్రభావం చూపుతాయి. ఇప్పటికే ఏవేవో అజ్ఞాత రుసుముల ద్వారా ఖాతాల్లోంచి సొమ్ములు హరిస్తున్న బ్యాంకుల లాభాల గ్రాఫ్ పెరిగిపోతోంది. బ్యాంకుల్లో లాభాలు పెరిగితే అది ప్రభుత్వానికి ఆదాయం పెరిగినట్లే. కరెన్సీ ఖర్చు, బ్యాంకుల నిర్వహణ వ్యయం తగ్గి బ్యాంకింగ్ రంగం ద్వారా కేంద్రానికి వందల కోట్ల ప్రయోజనం దక్కుతోంది. ఇక యాప్‌ల విషయానికొస్తే అవి



ఇప్పటికే లాభాల్లో ఉన్నాయి. 2017 లో ప్రారంభమైన గూగుల్ పే కు మన దేశంలో 50 కోట్ల వాడకందార్లున్నారు. 2025 లో అది రూ. 50 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అది అమెరికాలోని ఆల్ఫాబెట్‌కు సొంతమైన గూగుల్‌కు అనుబంధ సంస్థ. యుపిఐ మార్కెట్‌ను 46% పంచుకుంటున్న ఫోన్ పే కూడా అమెరికాకు చెందిన వాల్ మార్ట్ కంపెనీది. బ్యాంకు లోన్‌లు, బీమా లాంటి వ్యాపారాల ప్రకటనల ద్వారా వాటిని అదనపు ఆదాయం ఉంటోంది. ఆన్ లైన్ పేమెంట్ ద్వారా వ్యాపారాభివృద్ధి పొందుతున్న సంస్థలు బ్యాంకులకు, పేమెంట్ ప్రాసెస్ చేసే కంపెనీకు ఇప్పటికే కొంత చార్జీలు చెల్లిస్తున్నాయి. కస్టమర్లపై ఎలాంటి భారం వేసే అవసరం లేకుండా ఈ వ్యవస్థలు లాభాలు పొందుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఎండిఆర్ వసూలు ముమ్మాటికీ ప్రజల సొమ్మును దోచుకోవడమే. గూగుల్ పే లాంటి విదేశీ సంస్థలకు లాభాలు తెచ్చిపెట్టే బదులుగా దేశీయ భీమ్ యాప్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేసే అవసరం ఎంతో ఉంది. చైనాలో గూగుల్ పేను అనుమతి లేదు. ఆ దేశానికి వెళ్ళగానే అక్కడి యుపిఐ వేదికలైన అలీ పే తదితరాలను డౌన్ లోడ్ చేసుకోవలసిందే. సాంకేతికంగా ఎంతో ముందున్నామని చెప్పుకొనే మనకు దీటైన సొంత పేమెంట్ యాప్ లేకపోవడం శోచనీయం. కొత్త చార్జీలు కస్టమర్లపై పడవు, పూర్తిగా వ్యాపారులే భరిస్తారని ప్రభుత్వం చెబుతోంది. ఎప్పటి మాదిరిగానే వినియోగదారులు యుపిఐ చెల్లింపులను ఉచితంగానే పొందవచ్చు అని ఆర్థిక శాఖ తెలుపుతోంది. అయితే వ్యాపారుల పద్ధతి అందుకు భిన్నంగా ఉంది. ఉత్తరప్రదేశ్ లోని వ్యాపారులు ఈ విధానంపట్ల తమ నిరసనలు ప్రదర్శిస్తున్నారు. నగదు ద్వారానే అమ్మకాలు ఉంటాయని బోర్డులు పెట్టారు. చక్కెర నగదుపై రూ. 60, యుపిఐ అయితే రూ. 61 అని సరుకుల ధరల వివరాలు విడివిడిగా వాటిపై ఉన్నాయి. ఎవరికీ నష్టం లేకుండా సజావుగా సాగుతున్న ఈ చెల్లింపు వ్యవస్థ నుండి ప్రైవేటు సంస్థలకు లాభాలు తెచ్చిపెట్టాలనే ఆలోచన పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్య. కాంగ్రెస్ ఈ విషయాన్నీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు లేదు. విపక్ష పార్టీలు స్తబ్దుగా ఉన్న చోట ఇప్పుడు యువత కదిలి వస్తోంది. ఎండిఆర్ ప్రవేశాన్ని కూడా అదే స్థాయిలో నిలవరించవలసిన అవసరం ఉంది.

# ఫార్మాడ్రగ్స్ మత్తులో యువత...



హైదరాబాద్,దేశం లోని అనేక రాష్ట్రాల్లో యువత హెరాయిన్ అనే మత్తు పదార్థానికి బానిసలవుతున్నారు. మార్ఫిన్, కోడైన్, ఆక్సికోడోన్, ఫెంటానిల్, హెరాయిన్ అనేవి ఓపియాయిడ్లు. ఇవి మెదడు, నాడీ వ్యవస్థపై ప్రధానంగా నొప్పి తగ్గించడానికి వినియోగిస్తారు. వైద్యపరంగా సరైన మోతాదులో వీటిని వినియోగిస్తే నొప్పి నియంత్రణలో సహాయపడతాయి. వీటిని వ్యసనంగా చేసుకుని ఎక్కువ మోతాదులో వాడితే లేదా తప్పుగా వాడితే నిద్రమత్తు, మలబద్ధకం, శ్వాస నెమ్మదించడం, క్రమంగా ప్రాణాంకతం కావచ్చు. జనాభా శాతంతో చూస్తే ఒపియాయిడ్ సమస్య మిజోరం, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, మణిపూర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పదేళ్ల వయసు నుంచి 75 ఏళ్ల వృద్ధుల వరకు దాదాపు 2% మంది హెరాయిన్‌ను అత్యధికంగా వినియోగిస్తున్నారని 2018 నాటి సర్వేలో బయటపడింది. అలాగే పాఠశాల విద్యార్థుల్లో వీటి వినియోగం 2.8 శాతంగా నమోదైంది. హెరాయిన్‌కు బానిసైన యువతలో చదువు, ఉద్యోగం, సామాజిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం ఉంటోంది. శారీరక, మానసిక ఆరోగ్యం బాగా దెబ్బతింటోంది. డ్రగ్స్ అక్రమ రవాణాలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్‌లో ప్రస్తుతం హెరాయిన్ లభ్యత బాగా తగ్గిపోవడంతో దాని స్థానంలో ఫార్మాస్యూటికల్ డ్రగ్స్ వినియోగం యువతలో పెరిగింది. ఈ ఫార్మాస్యూటికల్ మత్తు పదార్థాలు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో పంజాబ్ లోకి వస్తుండడం వీటిని నివారించడం పోలీస్‌లకు పెద్ద సవాలుగా మారింది. ఈ ఫార్మాడ్రగ్స్‌లో ఎక్కువ భాగం పంజాబ్‌లో తయారు కావడం లేదు. ఇవి హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీల్లో తయారవుతున్నాయి. ఈ రాష్ట్రాలకు సంబంధించిన మత్తుమందుల్లో 11.54 లక్షల ఫార్మాస్యూటికల్ మాత్రలు, కాప్సూల్స్‌ను గత సంవత్సరం నుంచి స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్‌లో అందుబాటులో ఉన్న ఈ డ్రగ్స్ లో సుమారు 80% ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నాయని అంచనా. ఇది గతంలో ఉన్న పరిస్థితికి పూర్తి విరుద్ధం. అప్పట్లో పంజాబ్ లోకి అక్రమంగా వచ్చే డ్రగ్స్‌లో సుమారు 80 శాతం పాకిస్థాన్ సరిహద్దు అవతలి నుంచి అక్రమ రవాణా అయ్యేవి. 2024లో పంజాబ్‌లో పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. 2024 తొలి ఆరు నెలల్లోనే 215 కిలోల హెరాయిన్ స్వాధీనం అయింది. ఇప్పుడు కొత్త ధోరణి పంజాబ్‌లో కనిపిస్తోంది. ఫార్మా ఔషధాల దుర్వినియోగం ఎక్కువైంది. ఇప్పుడు ఫార్మాడ్రగ్స్ ఉత్పత్తి అయ్యే రాష్ట్రాలు, వాటిని ఇతర ప్రాంతాలకు తరలించే మార్గం లోని రాష్ట్రాలు కలిసి డ్రగ్స్ తయారీదారులు, పంపిణీదారులు, అలాగే వ్యవస్థీకృతంగా పనిచేస్తున్న డ్రగ్ నెట్‌వర్క్‌లపై సమన్వయంతో చర్యలు తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. డ్రగ్స్ తయారీ యూనిట్ల నియంత్రణ, విక్రయం, కొనుగోలు, రవాణా వీటిన్నిటినీ పర్యవేక్షించడం, అవి పంజాబ్‌కు అక్రమంగా మళ్లించబడకుండా నిరోధించడం తదితర కార్యకలాపాల నివారణకు పాకిస్థాన్ సరిహద్దు నుంచి డ్రోన్ల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి బిఎస్ఎఫ్, పోలీస్ దళాలు బహుళ స్థాయి చర్యలు చేపట్టారు. ఈ చర్యల ఫలితంగా పంజాబ్‌లో వీధుల్లోనే విచ్చలవిడిగా లభించే హెరాయిన్‌ను అడ్డుకోగలిగారు. దీంతో పంజాబ్ యువతకు హెరాయిన్ లభ్యంకాక, మత్తు కలిగించే ఫార్మాడ్రగ్స్ వాడటం ప్రారంభమైంది. సెప్టెంబర్ 3న మొబైల్ డ్రోన్ గుర్తింపు వేదిక అయిన 'డ్రోన్ సెన్స్ డి 200 ప్రో'కు చెందిన మూడు యూనిట్లు సరిహద్దు జిల్లాల్లోని వ్యూహాత్మక ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయి. డ్రగ్స్‌ను అక్రమంగా రవాణా చేసే డ్రోన్లకు సంబంధించిన కార్యకలాపాలను గుర్తించి, వాటి ఖచ్చితమైన స్థానాన్ని, డ్రోన్లు ఎక్కడైతే డ్రగ్స్‌ను విడిచిపెడతాయో కనుక్కోగలగడం ఈ డ్రోన్‌సెన్స్ డి 200 ప్రో వ్యవస్థ లక్ష్యం. దీని ద్వారా భద్రతా సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని చర్యలు తీసుకోగలుగుతుంది. ఈ చర్యల కోసం 52 డ్రోన్ రెస్పాన్స్ టీమ్స్ (డిఆర్‌టిఎస్) ఏర్పాటయ్యాయి. వీటిలో 147 మంది పోలీస్ సిబ్బంది ఉంటారు. ఈ బృందాలు బిఎస్ఎఫ్‌తో కలిసి పనిచేస్తాయి. డ్రోన్ల డ్రగ్స్ రవాణా సంబంధమైన హెచ్చరికలు వచ్చిన వెంటనే ఈ బృందాలు స్పందించి డ్రోన్లు ఎక్కడైతే డ్రగ్స్‌ను జారవిడిచాయో అక్కడకు వెళ్లి నిఘా ఉంటాయి. ఆ ప్రదేశాల్లో గస్తీ కాసి, డ్రగ్స్‌ను తీసుకెళ్లడానికి వచ్చిన వారిని పట్టుకుంటాయి. ఈమేరకు పోలీసులు మొత్తం 9 యాంటీ డ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వీటిలో 3 'బాజ్'యాంటీడ్రోన్ వ్యవస్థలు. గత సంవత్సరం ఆగస్టు నుంచి అమృత్‌సర్, తరన్ తారన్, ఫిరోజ్‌పూర్ ప్రాంతాల్లో ఇవి పనిచేస్తున్నాయి. ఇవి డ్రగ్స్ రవాణా డ్రోన్ల కదలికలను ముందుగానే పసికట్టి వాటి కమ్యూనికేషన్‌ను స్తంభింప చేస్తాయి. అలాగే సరిహద్దు ప్రాంతాల్లో విలేజీ డిఫెన్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలే పోలీసులకు కళ్లు, చెవులుగా పనిచేస్తాయి. 'యుద్ధ్ నషా విరుద్ధ్ (మాదకద్రవ్యాల వ్యతిరేక) ప్రచారం ద్వారా 2025 మార్చి 1నుంచి డ్రగ్స్ అక్రమ రవాణాదారులైన దాదాపు 80,000 మందిని అరెస్ట్ చేశారు. డ్రగ్ నెట్‌వర్క్‌ల ఆర్థిక పునాదులను దెబ్బతీయడానికి ఆర్థిక ఆంక్షలతో కూడిన చర్యలను తీసుకుంటున్నారు. డ్రగ్స్ ఉత్పత్తికి, అక్రమ రవాణాకు పాల్పడిన వారికి సంబంధించిన రూ. 336 కోట్లకు పైగా ఆస్తులను స్తంభింప చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సమాచారం ఎవరైనా తెలియజేసినా, వాటి ఆచూకీ చెప్పగలిగినా అలాంటి వారికి రివార్డు పాలసీని అమలు చేస్తున్నారు. డ్రగ్స్ రవాణా డ్రోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నందుకు రూ. 25,000 నగదు బహుమతిని అందిస్తున్నారు.

# కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పర్యటన...

నెల్లూరు, నెల్లూరు జిల్లాలోని బిజెపి జిల్లా ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కర్నాటి ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 2న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా రాయలసీమలో 40 వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన హార్ది కల్చర్ హబ్ శంకుస్థాపన చేస్తున్నారని ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పాల్గొంటారు అని తెలిపారు. రాయలసీమ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఏ మాటలు చెప్పిందో వాటన్నిటిని నెరవేరుస్తుందని గతంలో రాయలసీమ అభివృద్ధిలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మా కూటమి ప్రభుత్వం చేస్తుందని తెలియజేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి జన్మదిన సందర్భంగా ఈనెల 17వ తేదీ న దేశవ్యాప్తంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగిందని వారి యొక్క జన్మదిన పురస్కరించుకొని దేశవ్యాప్తంగా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అలాగే దేశవ్యాప్తంగా ఒక పండుగ వాతావరణం గా 17వ తేదీన ఆయనకి అనేక కుటుంబాలు ఆశీర్వాద దీపాన్ని వెలిగించి ప్రధానమంత్రి కి ఆశీర్వాదాలు అందించారని పత్రికా సమావేశంలో తెలియజేశారు. వైసిపి అనేది ఒక రాజకీయ పార్టీనా లేక గుండాల పార్టీనా

# నలుగురు జెన్‌జీలకు కోటంరెడ్డి టిక్కెట్లు

నెల్లూరు,ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త నాయకత్వానికి బాటలు వేసే దిశగా అధికార కూటమి వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. రాజకీయాల్లో పేరుకుపోయిన సంప్రదాయ మూస ధోరణిని బద్దలు కొడుతూ, డిజిటల్ యుగంలో పెరిగిన జెన్ జీ యువతను ప్రత్యక్ష ప్రజా జీవితంలోకి ఆహ్వానించాలన్న సరికొత్త కాన్సెప్ట్‌ను తెరపైకి తెస్తోంది. తలలు పండిన తర్వాతే ప్రత్యక్ష ఎన్నికల్లోకి రావాలన్న పాతకాలపు నిబంధనలను పక్కనపెట్టి, సమాజం పట్ల బాధ్యత, సామాజిక చైతన్యం, యువ రక్తంలో ఉన్న ఫైర్‌ను గుర్తించి వారిని కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా నిలబెట్టేందుకు క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసింది. ఈ విప్లవాత్మక మార్పునకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయం ఒక బలమైన నాందిగా నిలిచింది. తన నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ డివిజన్లలో నలుగురు యువ జెన్ జీ అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించడమే కాకుండా, వారి ఎన్నికల ఖర్చు మొత్తాన్ని తానే స్వయంగా భరిస్తానని ఆయన ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. రాజకీయాలంటే కేవలం ధనబలం, కుల సమీకరణాలు, పాతతరం నేతలకే పరిమితం కాదనే స్పష్టమైన సందేశాన్ని ఇది ప్రజల్లోకి పంపింది. ఇదే మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కీలక నగరాలు, మేజర్ మున్సిపాలిటీల్లో అమలు చేసి, విద్యావంతులైన యువతను రాజకీయాల్లోకి లాగాలని కూటమి పెద్దలు భావిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ఓటరు నాడిని పరిశీలిస్తే.. సాంకేతికత, ఆధునిక ఆలోచనలు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే నాయకత్వాన్నే నేటి తరం కోరుకుంటోంది. సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే యువతీయువకులు పాలనా వ్యవస్థలో భాగస్వాములయితే స్థానిక సంస్థల పనితీరు సమూలంగా మారుతుందని కూటమి విశ్లేషిస్తోంది. ఈ సరికొత్త ప్రయోగం వెనుక ఉన్న అసలు రాజకీయ లక్ష్యం భవిష్యత్ నాయకత్వ నిర్మాణం . టీడీపీ, జనసేన శ్రేణుల్లో రాబోయే రెండు మూడు దశాబ్దాల రాజకీయాలను శాసించగల బలమైన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ఈ మున్సిపల్ పోరు నుంచే తయారు చేయాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో వార్డు, డివిజన్ స్థాయి నుంచే ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులను తీర్చిదిద్దడం వల్ల పార్టీల సంస్థాగత పునాదులు మరింత పటిష్టమవుతాయని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీల బలపరీక్షగానే కాకుండా.. సంప్రదాయ పాతతరం రాజకీయాలకు, ఆవేశం–ఆలోచన కలగలిసిన కొత్తతరం ఆలోచనలకు మధ్య జరిగే పరివర్తనగా మారనున్నాయి. యువతకు టిక్కెట్లు ఇవ్వడంతో పాటు వారిని గెలిపించుకోగలిగితే, ఏపీ రాజకీయాల్లో ఇదొక సువర్ణ అధ్యాయంగా మిగిలిపోనుంది. ఒకప్పుడు రాజకీయాలంటే భయపడి దూరంగా ఉన్న విద్యావంతులైన యువత, నేడు స్థానిక పాలనను తమ చేతుల్లోకి తీసుకునేందుకు సిద్ధమవుతుండటం రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు శుభపరిణామం అవుతుందనడంలో సందేహం లేదు.

# వాజ్‌పేయి నగర్‌లో రోడ్లకు గ్రహణం

కుత్బుల్లాపూర్,వాజ్‌పేయి నగర్‌లోనీ రోడ్లు, వీధి దీపాల సమస్యలు కాలనీవాసులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. అభివృద్ధి పనుల పేరుతో పలు చోట్ల ఉన్న రహదారులను తవ్వినప్పటికీ నెలలు గడుస్తున్నా వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించకపోవడంతో గుంతలు,ఎగుడుదిగుడు మార్గాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతు న్నారని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయక రాత్రివేళ చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తవ్విన రోడ్లతో రాకపోకలకు అవస్థలు

రోడ్లపై ఏర్పడిన గుంతలు, అసమతల మార్గాలతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇళ్ల ముందు మెట్లు, రాకపోకల దారులు దెబ్బతినడంతో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు బయటకు రావాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. వర్షం కురిసిన సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర వాహనాల రాకపోకలపై ఆందోళనకాలనీలో రహదారుల పరిస్థితి ఇలాగే కొనసాగితే అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించడం కష్టంగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రికి తరలించే సమయంలో రోడ్ల పరిస్థితి ఆటంకంగా మారకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వీధి దీపాలు లేక. రాత్రివేళ భయం గుప్పెట్లో ప్రజలు

వాజ్‌పేయి నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రివేళ చీకట్లు అలుముకుంటున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడటంతో పాటు భద్రతపై ఆందోళన చెందుతున్నామని పనిచేయని దీపాలను వెంటనే మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త దీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు గుంతల్లో వర్షపు నీరు. దోమల బెడదఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి పోతోందని స్థానికులు తెలిపారు. దీంతో రాకపోకలకు మరింత అంతరాయం కలుగుతోందని,నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రోడ్లను పునరుద్ధరించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

# బీఆర్ఎస్ నాయకుల కేటీపీఎస్ సందర్శన

పాల్వంచ,చేతగాని దద్దమ్మ ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదని,రైతాంగం నిర్వేదంతో,బాధల్లో ఉన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయానికి సాగునీళ్లు, విత్తనాలు, కరెంట్,యూరియా సక్రమంగా సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పాలకులపై ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు కే.టీ.రామారావుల పిలుపు మేరకు ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన గులాబీ శ్రేణులు గురువారం పాల్వంచలోని కేటీపీఎస్ సందర్శనకు వెళ్లారు. థర్మల్ పవర్ స్టేషన్ లో బొగ్గు నిల్వలు, విద్యుదుత్పత్తికి సంబంధించి వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు, రైతులు వెడుతుండగా పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు బ్యారికేడ్స్ అడ్డుపెట్టి నిలువరించారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకోగా పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ఆ తర్వాత ఎంపీ వద్దిరాజు నేతృత్వంలో ప్రతినిధి బృందం కేటీపీఎస్ లోపలికి వెళ్లి బొగ్గు నిల్వల్ని, విద్యుదుత్పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేస్తున్న తీరును దుయ్యబట్టారు. సాగునీళ్లు,కరెంట్ సక్రమంగా సరఫరా చేస్తే పంటలు పండుతాయని, వాటిని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి వస్తుందని..వాటిని నెరవేర్చడం చేతగాకే ముఖ్యమంత్రి రేవంత్

# హుజూరాబాద్‌కూ బీఆర్ఎస్ రెడీ కావాల్సిందే!




హైదరాబాద్,పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అస్త్రంగా చేసుకుని సుప్రీంకోర్టు దాకా న్యాయపోరాటం చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయించడంలో బీఆర్ఎస్ అధిష్ఠానం విజయం సాధించింది. ఇప్పటికి బీజేపీ అధికారికంగా మూడు సీట్లను కోల్పోయింది. ఇద్దరు ఎమ్మెల్యేలు చనిపోయారు. మూడో ఎమ్మెల్యే అనర్హతకు గురయ్యారు. మరో ఎమ్మెల్యేను కూడా తగ్గించేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లక్ష్యంగా అనర్హత అస్త్రాన్ని సిద్ధం చేస్తోంది. ఒకే దెబ్బకు రెండు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు తీసుకొచ్చి బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టాలన్నది రేవంత్ రెడ్డి సర్కార్ పక్కా ప్లాన్‌గా కనిపిస్తోంది.

**ప్రివిలేజ్ కమిటీ వద్ద పాడి కౌశిక్ రెడ్డి ఇష్యూ**

శాసనసభ సమావేశాల్లో సీనియర్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తనను కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే శాసనసభ ప్రివిలేజ్ కమిటీ విచారణను ముమ్మరం చేసింది. సభా మర్యాదలు ఉల్లంఘించడం, అసెంబ్లీ సాక్షిగా తోటి సభ్యుడిని అవమానించేలా ప్రవర్తించడంపై కమిటీ నివేదికను సిద్ధం చేస్తోంది. ప్రివిలేజ్ కమిటీ ఇచ్చే సిఫారసుల ఆధారంగా కౌశిక్ రెడ్డిపై శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు లైన్ క్లియర్ అవుతోంది. సభా నియమావళి, శాసనసభ అంతర్గత క్రమశిక్షణ వ్యవహారాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 212 ప్రకారం కోర్టులు నేరుగా జోక్యం చేసుకోలేవన్నది న్యాయ నిపుణుల స్పష్టమైన అభిప్రాయం.

**గతంలో కోమటిరెడ్డి, సంపత్‌లపై అనర్హతా వేటు**

గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనూ సరిగ్గా ఇలాంటి సంప్రదాయమే నడిచింది. ఉమ్మడి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సమయంలో హెడ్‌ఫోన్స్ విసిరేశారన్న కారణంతో కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్‌ల శాసనసభ సభ్యత్వాలను రద్దు చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. న్యాయస్థానాలు సైతం శాసనసభాపతి నిర్ణయాధికారాల పరిధిని పరిగణనలోకి తీసుకుంటూ తీర్పులు ఇచ్చాయి. ఇప్పుడు అదే అస్త్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ప్రయోగించేందుకు పూర్తి కసరత్తు చేస్తోంది. దానం నాగేందర్ కేసులో టెన్త్ షెడ్యూల్ నిబంధనలతో కోర్టుల ద్వారా బీఆర్ఎస్ ముందడుగు వేస్తే, కౌశిక్ రెడ్డి విషయంలో అసెంబ్లీ విశేషాధికారాల కమిటీ నివేదిక ద్వారా కాంగ్రెస్ తన రాజకీయ పగను తీర్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంది.

**ఉపఎన్నికలు విపక్షానికి పెద్ద సమస్య**

ఒకవేళ కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు పడితే.. తెలంగాణలో కేవలం ఖైరతాబాద్ మాత్రమే కాకుండా హుజూరాబాద్ నియోజకవర్గంలోనూ ఉపఎన్నిక అనివార్యమవుతుంది. ఒకవైపు హైదరాబాద్ నగరంలో దానంపై వచ్చిన తీర్పును రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలో తెలియక బీఆర్ఎస్ తలమునకలవుతుండగా, మరోవైపు కరీంనగర్ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన హుజూరాబాద్ స్థానంలోనూ ఉపఎన్నికకు వెళ్లాల్సి రావడం గులాబీ పార్టీకి శరాఘాతమే అవుతుంది. దూకుడు ప్రదర్శిస్తున్న కౌశిక్ రెడ్డిని కట్టడి చేయడంతో పాటు, ఆ స్థానాన్ని తిరిగి చేజిక్కించుకుని బీఆర్ఎస్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని కాంగ్రెస్ భావిస్తోంది. అంతిమంగా, దానంపై వేటు వేయించి సంబరపడేలోపే.. హుజూరాబాద్ రూపంలో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ డబుల్ షాక్ ఇవ్వడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

# జగన్ లో కొత్త ఆందోళన...



విశాఖపట్టణం,ఓటమి ఇచ్చిన గాయం కంటే, రానున్న రోజుల్లో చుట్టుముట్టబోయే చట్టపరమైన ఉచ్చులే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆయన అడుగులు, ప్రసంగాలు, ఆకస్మిక కార్యాచరణలను నిశితంగా పరిశీలిస్తే ఆ అంతర్గత కంగారు స్పష్టంగా బయటపడుతోంది. నిరుద్యోగులను రెచ్చగొట్టేందుకు డీఎస్సీ క్రీడా కోటాపై ఆధారాల్లేని ఆరోపణలు గుప్పించడం, ఏ చిన్న అవకాశాన్ని వదలకుండా హుటాహుటిన రాజ్ భవన్‌కు పరుగులెత్తి గవర్నర్‌కు వినతిపత్రాలు సమర్పించడం వంటివి ఆయన కంగారును చూపిస్తున్నాయి. ఏపీలో గత ఐదేళ్ల పాలనలో సాగిన భారీ లిక్కర్ సిండికేట్ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శరవేగంగా పావులు కదుపుతోంది. ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని మించిన రీతిలో సాగిన నగదు లావాదేవీలు, డిస్టిలరీల బెదిరింపులు, ప్రత్యేక బ్రాండ్ల ముసుగులో జరిగిన దోపిడీకి సంబంధించిన మనీ ట్రయల్స్ చిక్కుముడులను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో ఛేదించినట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. దర్యాప్తు పరిధి విస్తరిస్తున్న కొద్దీ తాడేపల్లి కీలక చక్రాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా, తెరవెనుక ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించినట్లు ప్రచారంలో ఉన్న ఆయన సమీప బంధువు అనిల్ రెడ్డి పాత్రపై దర్యాప్తు సంస్థల నిఘా మరింత కఠినతరమైంది. లిక్కర్ స్కామ్‌లో ముడుపుల సేకరణ, వాటిని హవాలా మార్గాల్లోకి మళ్లించడం వెనుక కీలక సూత్రధారిగా భావిస్తున్న అనిల్ రెడ్డిని ఈడీ ఏ క్షణమైనా అదుపులోకి తీసుకునే అవకాశముందన్న గుసగుసలు తారాస్థాయికి చేరాయి. ఒకసారి సూత్రధారులు పట్టుబడితే దర్యాప్తు సెగ నేరుగా అధినేత ద్వారాలనే తాకుతుందని జగన్‌కు స్పష్టంగా అర్థమైపోయింది. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకవైపు మీడియా సమావేశాల్లో దూకుడు ప్రదర్శిస్తూనే, మరోవైపు తీవ్ర నైతిక రక్షణలోకి వెళ్లే పరిస్థితి తలెత్తింది. ఇదే సమయంలో ఆయన బెంగళూరు ప్యాలెస్ కేంద్రంగా సాగుతున్న రహస్య మంతనాలు సరికొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి. తన ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ తరపున రాజ్యసభకు పంపిన రిలయన్స్ గ్రూప్ కీలక ప్రతినిధి పరిమళ్ నత్వానీ ఇటీవల బెంగళూరులో ఓ వివాహ వేడుకకు హాజరైనప్పుడు.. జగన్ ఆయనను ప్రత్యేకంగా తన నివాసానికి ఆహ్వానించి ఏకాంత చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు, ఢిల్లీ రాజకీయాల్లో విస్తృత పలుకుబడి ఉన్న పరిమళ్ నత్వానీతో జగన్ ఏం మాట్లాడి ఉంటారనేది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. కేసులు ముంచుకొస్తున్న వేళ ఢిల్లీ స్థాయిలో రాయబారాలు నడిపి రక్షణ పొందడానికే ఈ ఆకస్మిక లంచ్ డిప్లొమసీని ఉపయోగించుకున్నారు. ఒకవైపు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు, పోలవరం పనుల పునరుద్ధరణ, రాజధాని నిర్మాణాలతో ముందుకెళ్తుంటే.. మరోవైపు జగన్ మాత్రం పాత స్క్రిప్టులు వల్లెవేస్తూ, కల్పిత ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు. పచ్చి అబద్ధాలతో ప్రజలను నమ్మించలేమని తెలిసినప్పటికీ, కేసుల నుంచి ప్రజా దృష్టిని మరల్చడానికి ఆయన చేస్తున్న ఈ ఆపసోపాలు సొంత కేడర్‌లోనే నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దూకుడు, అనిల్ రెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు, బెంగళూరు రహస్య భేటీలు.. ఇవన్నీ జగన్ రాజకీయ భవితవ్యం తీవ్ర సంక్షోభంలో పడిందనడానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా నిలుస్తున్నాయివైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నేతలను పిలిపించుకుని ప్రసంగించారు. ఎప్పుడూ చెప్పే మాటలే చెప్పారు. కూటమి ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు గుప్పించడంతో పాటు.. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ గతంలో తామే చేసేశామని, భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి అదానీ డేటా సెంటర్ దాకా అన్నీ తమ ఘనతేనంటూ ఆయన చెప్పుకున్నారు. విశాఖకు ఐటీ కంపెనీలను తరిమేసి, రుషికొండను బోడిగుండు చేసి విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించుకున్న ఘన చరిత్రను ప్రజలు ఇంకా మరువకముందే.. తానేదో నగరాన్ని ఉద్ధరించేశానని జగన్ చెప్పుకోవడం విడ్డూరంగా మారింది. తన ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్రకు రాజధాని ముసుగులో భూకబ్జాలు, గంజాయి దందాలు తప్ప చేసిందేమీ లేదు. అయినా మేం చేసిన అభివృద్ధి కళ్ల ముందే ఉందని చెప్పుకున్నారు. అన్నింటికంటే పరాకాష్ట ఏమిటంటే.. "మా హయాంలో పోలీసులను వాడుకోలేదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేదు" అంటూ జగన్ చెప్పుకోవడంఅయిదేళ్ల పాటు ప్రత్యర్థి పార్టీల నేతలపై అక్రమ కేసులు, సీఐడీ వేధింపులు, అర్ధరాత్రి అరెస్టులు, ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను సొంత ప్రైవేటు సైన్యంగా మార్చుకున్న తీరు యావత్ దేశానికే తెలుసు. అలాంటి వ్యక్తి నేడు పోలీసులపై నిందలు వేస్తూ.. అధికారుల పేర్లను డిజిటల్ డైరీ లో రాసి పెట్టుకోవాలని, మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం రాగానే సినిమా చూపిస్తామని కేడర్‌ను బహిరంగంగా రెచ్చగొట్టడం ఆయన హింసాత్మక రాజకీయ మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తోంది. వినేవాళ్లు, గుడ్డిగా నమ్మేవాళ్లు ఉంటే జగన్ రెడ్డి ఎలాంటి కట్టుకథలైనా చెబుతారనేందుకు ఆయన ప్రసంగమే సాక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో కేడర్‌లో నైతిక స్థైర్యం నశించిందని గ్రహించిన జగన్.. లేని గెలుపును ఊహించుకుంటూ కార్యకర్తలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ వారేమీ వేరే గ్రహం నుంచి రాలేదు కదా.. జగన్ రెడ్డి పాలన చేసినప్పుడూ వారు ఉన్నారు. తెలియకుండా ఉంటుందా?

# ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి : సీఈవో సుదర్శన్ రెడ్డి



వికారాబాద్ : ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల ను పరిశీలించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారుల పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాండూర్ పట్టణంలోని పాత మున్సిపాలిటీ, ఎంపీటీ హాల్, గౌతాపూర్ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆన సందర్శించి బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటరు నమోదు, నోటీసుల పంపిణీ, ధ్రువీకరణ పత్రాల స్వీకరణ తదితర ప్రక్రియలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం ఓటర్లకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం 72 శాతం నోటీసుల పంపిణీ పూర్తయినట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అందులో పేర్కొన్న వివరాల ప్రకారం అవసరమైన సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఉందని వివరించారు. అలాగే ఆయా ప్రాంతాల్లోని బీఎల్‌వోల సహకారంతో కూడా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. తాండూర్ ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ , ఆర్డీవో అనిత, తహసీల్దార్ తారా సింగ్, డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల కోసం అభిజిత్ దీప్కే సంచలన లేఖ



న్యూఢిల్లీ,అధికార పార్టీపై విమర్శలు గుప్పిస్తూ, వివిధ సమస్యలపై ప్రభుత్వాలను నిలదీస్తూ లేఖాస్త్రాలను వదిలే కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఈ సారి రూటు మార్చాడు. ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేస్తున్న విపక్షానికి సూటి ప్రశ్నలు సంధిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర లేఖ రాశాడు. 'ప్రతిపక్షాల కోసం' అంటూ రాసిన ఈ లేఖ ప్రస్తుతం హాట్ టాపిక్ అవుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ 48 గంటల డెడ్ లైను విధించిన అభిజిత్ దీప్కే ఈ రోజు మరోసారి ఆ విషయమై స్పందిస్తూ ఇంకా 24 గంటల సమయం మాత్రమే ఉందని గుర్తు చేశాడు. ఇక ప్రతిపక్షాల కోసం అంటూ ఆయన రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేవలం ఏడు గంటల వ్యవధిలో దాదాపు ఏడు వేల మంది ఈ లేఖను రీ పోస్టు చేయగా, సుమారు రెండు వేల మంది కామెంట్లతో హోరెత్తించారు. ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే రాసిన లేఖ విస్తృత చర్చకు తెరతీసింది. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతోందని, ఓటు చోరీ చేస్తున్నారని విమర్శలు చేస్తున్న విపక్షం అటువంటి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తోందని అభిజిత్ దీప్కే ప్రశ్నించాడు. ఎన్నికలను బహిష్కరించాలని అప్పుడే ప్రజాస్వామ్యం గురించి ఆలోచించిన వారు అవుతారంటూ వ్యాఖ్యానించాడు. ప్రతిపక్షాల కోసం అంటూ అభిజిత్ రాసిన లేఖలో అనేక విషయాలను ప్రస్తావించాడు. 'ఔను, ఎన్నికలు రిగ్గింగ్‌కు గురవుతున్నాయి. కానీ మీరు రిగ్గింగ్‌కు గురైన ఎన్నికలలో పాల్గొంటూ చట్టబద్ధం చేస్తున్నారు' అంటూ ఎత్తిచూపాడు. ప్రస్తుత ఎన్నికల తీరును మ్యాచ్ ఫిక్సింగ్ తో పోల్చిచూపుతూ, ఎన్నికల్లో పాల్గొంటున్న ప్రతిపక్షాలు ప్రతి క్యాచ్‌ను వదిలేయలేవు. కొన్ని క్యాచ్‌లు పట్టుకుంటాయి. ఇలా మ్యాచ్ చివరి ఓవర్ ఆడటం వల్ల పోటీ హోరాహోరీగా సాగుతున్నట్లు కనిపించవచ్చు. మీరు పోటీ పడేలా చేయడానికి నిజమైన పోటీ జరిగిందని ప్రజలు నమ్మించడానికి సరిపోయే కొన్ని విజయాలు మాత్రమే మీకు అందించబడతాయి." అని పేర్కొన్నాడు. అధికార పార్టీ కావాల్సిన మెజార్టీ వరకు గెలుచుకుంటుందని, ప్రతిపక్షాలను ఎప్పటికీ అదే పాత్రకు పరిమితం చేస్తూ ఎన్నికలను ఫిక్స్ చేస్తున్నారనే అర్థం వచ్చేలా దీప్కే తన లేఖలో పేర్కొన్నాడని చెబుతున్నారు. ఇక ప్రతిపక్షాలు అస్తిత్వం కోల్పోతాయనే భయంతోనే పోటీ పడుతూ ఉన్నాయని, కానీ ఓట్లు దొంగతనం జరిగినప్పుడు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కొనుగోలు జరుగుతున్నప్పుడు, ప్రతిపక్ష పార్టీలు చీలిపోతున్నప్పుడు ఏ రకమైన అస్తిత్వాన్ని రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించాడు. ఇది రాజకీయ మనుగడ కాదని, ఇలాంటి సిస్టమ్ లో ఎన్నాళ్లు జీవించగలరని నిలదీశాడు. మీ సొంత రాజకీయ మనుగడ కోసం ఆలోచించే ముందు దేశం, ప్రజాస్వామ్యం కోసం ఆలోచించాలని సూచించారు.

# దానం నాగేందర్.. నెక్ట్స్ కడియం శ్రీహరి?



హైదరాబాద్,పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు వేసిన అనర్హత వేటు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ పరిణామంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఈ ఇద్దరిపై గతంలో అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. ఇద్దరి వాదనలు విన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గత మార్చి 11న ఆ పిటిషన్లను కొట్టివేశారు. ఫిరాయింపునకు తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ అప్పట్లో ఆ కేసులను ముగించారు. అయితే స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు సెప్టెంబర్ 18న స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టింది. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ, ఆయన సభ్యత్వం 2024 ఏప్రిల్ 23 నుంచే రద్దయినట్లు తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, గురువారం ఆయన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో దానం అనర్హత ఖాయమైంది. సరిగ్గా అదే రోజు కడియం శ్రీహరి అనర్హత పిటిషన్ విషయంలోనూ రాబోయే న్యాయపరమైన పరిణామాలు ఎలా ఉంటాయనే చర్చ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. 2023 డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం శ్రీహరి గెలుపొందారు. ఆ తర్వాత 2024 మార్చి 31న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇదే సమయంలో ఆయన కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా గెలిచారు. కడియం శ్రీహరి పార్టీ మారడం, కాంగ్రెస్ తరఫున ప్రచారం చేయడం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై విమర్శలు చేయడాన్ని బీఆర్ఎస్ నేతలు తమ ఫిర్యాదులో ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పుడు దానం ఉదంతం నేపథ్యంలో కడియం భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

# రాహుల్ సైడ్.. ప్రియాంక ఇన్.. కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది..?



న్యూఢిల్లీ,కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యూహాల్లో నిశ్శబ్దంగా ఒక భారీ మార్పు చోటుచేసుకుంటోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం ఒక సరికొత్త రోల్ డివిజన్ కు శ్రీకారం చుట్టింది. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యతలను రాహుల్ గాంధీ చూసుకుంటుంటే.. క్షేత్రస్థాయిలో రాష్ట్రాల పోరును తన భుజస్కంధాలపై వేసుకునేందుకు ప్రియాంక గాంధీ వాద్రా సిద్ధమవుతున్నారు. ఈ కొత్త రాజకీయ సమీకరణం వెనుక ఒక పక్కా వ్యూహం దాగి ఉంది. సాధారణంగా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా 'మోదీ వర్సెస్ రాహుల్' పోరుగా మలచి జాతీయ అంశాల చుట్టూ తిప్పడం బీజేపీకి అలవాటైన శైలి. ఈ తంత్రానికి చెక్ పెట్టడానికే ప్రియాంకను ముందు వరుసలో నిలుపుతున్నారు. జాతీయ వివాదాల జోలికి వెళ్లకుండా.. ధరల పెరుగుదల, నిరుద్యోగం, మహిళా సంక్షేమం వంటి ప్రత్యక్ష ప్రజా సమస్యలనే ప్రధాన ఆయుధాలుగా మార్చుకోవడంలో ప్రియాంక సిద్ధహస్తురాలు. దీనివల్ల అసెంబ్లీ ఎన్నికల అజెండా స్థానిక అంశాల చుట్టూనే తిరిగేలా చేయడంలో కాంగ్రెస్ సఫలమవుతోంది. గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో నిమగ్నమైన వేళ.. ప్రియాంక నడిపిన దూకుడు ప్రచారమే పార్టీకి అద్భుత విజయాలను అందించింది. నాయనమ్మ ఇందిరా గాంధీని గుర్తుచేసే హావభావాలు, సాధారణ ప్రజలతో, ముఖ్యంగా మహిళా ఓటర్లతో సులభంగా మమేకమయ్యే నైజం ఉత్తర, మధ్య భారతంలో ఆమెకు ప్రత్యేక ఇమేజ్‌ను తెచ్చిపెట్టాయి. దీనికితోడు స్థానిక నాయకుల మధ్య ఉండే గ్రూపు తగాదాలను సమర్థవంతంగా చక్కదిద్దడంలోనూ ఆమె అనుసరించే శైలి మంచి ఫలితాలనిస్తోంది. అయితే, కేవలం వ్యక్తుల గ్లామర్ మాత్రమే ఎన్నికలను గెలిపించలేదనేది గత అనుభవాలు చెబుతున్న పాఠం. బూత్ స్థాయి మేనేజ్‌మెంట్, బలమైన సంస్థాగత నిర్మాణం లేకపోతే ఎంతటి నాయకత్వ చరిష్మా అయినా ఒంటరిగా విజయాన్ని అందించలేదని గత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఫలితాలు నిరూపించాయి. అందుకే ఈసారి ప్రియాంక క్రేజ్‌ను వాడుకోవడంతో పాటు క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని పటిష్టం చేసుకోవడం కాంగ్రెస్‌కు ప్రధాన సవాలుగా మారనుంది. పార్టీ సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ ఒక 'ట్రబుల్ షూటర్'లా కనిపించే ప్రియాంక ఫ్యాక్టర్‌ను ఈసారి పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ప్రయోగించాలని అధిష్ఠానం నిర్ణయించింది. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ పోరాటం, రాష్ట్రాల స్థాయిలో ప్రియాంక వ్యూహాత్మక ప్రచారం.. ఈ 'డబుల్ ఇంజన్' వ్యూహం రాబోయే ఎన్నికల సమరాల్లో కాంగ్రెస్‌కు ఏ మేరకు పునరుజ్జీవాన్ని ఇస్తుందో కాలమే నిర్ణయించాలి.

# షర్మిల కమిటీలు.. కాలయాపనేనా ..!



అమరావతి,ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి వైఎస్ షర్మిల పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆమె పార్టీ నాయకత్వాన్ని, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. ఒకవైపు కుమార్తె అంజలి వివాహ వేడుకల్లో బిజీగానే ఉన్నప్పటికీ.. మరోవైపు రాజకీయంగా పార్టీపై తన పట్టు నిలుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే షర్మిల కొత్తగా కమిటీలను ఏర్పాటు చేశారు. అయితే.. ఈ కమిటీలు ఇప్పటి వరకు చార్జి తీసుకోకపోవడతో ఇవి కాలయాపన కోసం వేసిన కమిటీలా? లేక.. నిజం గానే పనిచేస్తున్నాయా? అనేది ఆసక్తిగా మారింది. రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసిన షర్మిల.. దీనికి కీలక బాధ్యతలు అప్పగించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇటీవల సీనియర్ నేత, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్. రఘువీరారెడ్డి ఛైర్మన్‌గా 10 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి సమన్వయాన్ని పర్యవేక్షించాలన్నది షర్మిల పెట్టుకున్న లక్ష్యం. అయితే.. ఇప్పటి వరకు రఘువీరా రెడ్డి బాధ్యతలు చేపట్టిన పరిస్థితి కనిపించలేదు. .క్షేత్రస్థాయి పర్యటనలు – సమీక్షలు కూడా చేయడం లేదు. ముఖ్యంగా గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ఏకైక అజెండాగా పనిచేయాలని ఆమె జిల్లా, నగర కమిటీలకు దిశానిర్దేశం చేశారు. ఆయా కమిటీలు రఘువీరా కమిటీతో కలిసి పనిచేయాలన్నారు. కానీ, ఆ తరహా పరిస్థితి కనిపించడం లేదు. వివిధ జిల్లాల్లో (ఉదాహరణకు నంద్యాల) పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాల్లో ఆధిపత్య దోరణి కొట్టొచ్చినట్టు కనిపించింది. స్థానిక పరిస్థితులు అర్థం చేసుకోవాలని నాయకులు కోరుతున్నారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మి పార్టీలో ఉన్న కొందరికి అన్యాయం చేస్తున్నారని.. మెజారిటీ నాయకులు చెబుతున్నారు. కొత్త వారికి కూడా అవకాశాలు ఇవ్వాలని కోరుతున్న వారు మరికొందరు ఉన్నారు. ఇలా.. కమిటీలు వేసినా.. అవి పనిచేయక పోవడం.. క్షేత్రస్థాయి నాయకత్వంలో ఆధిపత్య ధోరణులు పెరగడం వంటివి చర్చకు దారి తీస్తున్నాయి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140